ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 16 జూలై 2024



మండలంలో యానిమేటర్ల చేతివాటం తారాస్థాయికి చేరింది. గ్రూపు సభ్యులను మాయమాటలతో నమ్మించి బురిడీ కొట్టిస్తూ లక్షల సొమ్ము స్వాహా చేస్తున్నారు. ఉప్పలూరులో ఇద్దరు యానిమేటర్లు దాదాపు రూ.40లక్షలు, యామవరంలో ఓ యానిమేటర్ దాదాపురూ.25లక్షలు గ్రూపు సభ్యులకు మాయమాటలు చెపి స్వాహా చేశారు. అవి మరవక ముందే ముద్దనూరు టౌన్‌లోని యానిమేటర్ మల్లిక దాదాపు రూ.30 లక్షలు గ్రూపు సభ్యుల పేరుతో తీసుకుని ఊరు విడిచి అజ్ఞాతంలోకి వెళ్లారు.

యానిమేటర్ చేతివాటం

- దాదాపు రూ.30లక్షలు స్వాహా

ముద్దనూరు జూలై 15: ముద్దనూరు టౌన్ వీవో-7లోని దాదాపు 30 గ్రూపులకు మల్లిక యానిమేటర్‌గా ఉన్నారు. కొన్ని గ్రూపుల సభ్యులకు ఆమె గ్రామ సమాఖ్య (వీవో), క్యాష్ క్రెడిట్ లిమిట్ (సీసీఎల్)లో బ్యాంక్ రుణాలు ఇప్పించారు. బ్యాంక్ రుణం కొద్దిమొత్తం తీసుకునే సభ్యులను టార్గెట్ చేసేవారు. వారిపై ఎక్కువ డబ్బులు లోన్ తీయించి, వారికి ఇచ్చేది పోను మిగతా సొమ్మును తను స్వాహా చేస్తూ వచ్చారు. అంతేకాకుండా వ్యక్తిగతంగానూ, దుకాణంపై బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. ఇలా దాదాపు రూ.30లక్షలు నొక్కేశారని సమాచారం. అయితే సమాచారం తెలుసుకున్న వెలుగు అధికారులు రికవరీ చేసే పనిపడ్డారు. కొంత సొమ్మును రికవరీ చేయించారు. ఆ సొమ్ము కూడా యానిమేటర్ మల్లిక సభ్యురాలుగా ఉన్న గ్రూపు నుంచి సీసీఎల్ రూ.4లక్షలు చెల్లించారు. ఇంకా చాలా మొత్తం సొమ్ము ఆమె వాడుకున్నారని అంటున్నారు. దీంతో అన్ని గ్రూపుల వద్దకు వెళ్లి అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం. అయితే మల్లిక కొద్దిరోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లారని తెలిసింది.

విచారిస్తున్నాం..

గ్రూపు సభ్యుల నుంచి బ్యాంకు రుణాలకు సంబంధించిన డబ్బులు యానిమేటర్ మల్లిక తీసుకున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేపట్టాం. చిత్రలేఖ గ్రూపునకు సంబంధించిన డబ్బు వాడుకున్నట్లు తెలవడంతో దాదాపు రూ.4లక్షలు కట్టించాం. ప్రస్తుతం మల్లిక అందుబాటులో లేరు. ప్రతి గ్రూపు వద్దకు వెళ్లి విచారిస్తున్నాం. పూర్తి విచారణ అనంతరం వివరాలు తెలుస్తాయి.

- ఇబ్రహీం, వెలుగు ఏపీఎం, ముద్దనూరు

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్



కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని పింఛన్ కట్ చేశారంటూ దివ్యాంగుడితో కలెక్టరేట్‌కు వచ్చిన తండ్రి

కడప(కలెక్టరేట్), జూలై 15: వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో కానీ, మండల స్థాయిలో బాధితులు అర్జీలు సమర్పిస్తే తక్షణమే వాటిని పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జేసీతో పాటు డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన అర్జీదారులు వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు సమర్పించారు. అందులో ఎక్కువగా భూ సమస్యలతో పాటు, వికలత్వం పింఛన్లు మంజూరు చేయాలంటూ అర్జీలు ఇచ్చారు. బాధితుల అర్జీలను స్వీకరిస్తూ, సాధక బాధలు వింటూ వెంటనే పరిష్కరించాలంటూ తదుపరి చర్యలకు సంబంధిత శాఖల అధికారులకు జేసీ సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. కాగా ఈ కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం ఎండకు, వానకు ఇబ్బంది కలగకుండా షామియానాలు ఏర్పాటు చేశారు.




ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్

కాండం తొలిచే పురుగు నివారణ పరికరానికి యూకే పేటెంట్



బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 15: పంటల సాగు సమయంలో కాండం తొలిచే పురుగు నివారణకు డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి రూపొందించిన వినూత్న పరికరానికి కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆఫీసు యునైటెడ్ కింగ్ డమ్ వారు పేటెంట్ సర్టిఫికెట్ మంజూరు చేశారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో భౌతిక శాస్త్ర రీడరుగా పనిచేస్తున్న బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి సోమవారం మాట్లాడుతూ తనతో పాటు నాగపూర్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ సంజయ్ దోబ్లే, నాగ్‌పూర్ పరిశోధక బృందం కలిసి 'డివైస్ ఫర్ కంట్రోలింగ్ ద స్టమ్ బోరర్ ఇన్సెక్ట్ ఇన్ క్రాప్ మేనేజ్‌మెంటు' అనే అంశంపై పరిశోధన చేశామన్నారు. ఎల్ఈడీ, ముఖ్యమైన నూనెలను ఉపయోగించి కీటకాలను రెండు విధాలుగా ఆకర్షించడానికి వినూత్న పరికరాన్ని మొదటిసారిగా అభివృద్ధి చేశామన్నారు. కీటకాలను సామూహికంగా పట్టుకోవడానికి ఏగ్లేమార్ మెలోస్ పల్ప్, వాటర్ కొల్లాయిడ్ ఉపయోగిస్తామన్నారు. పరికరానికి సోలార్ ప్యానెల్‌ను, బ్యాటరీని ఉపయోగించడం ద్వారా తక్కువ ఓల్టేజీతో పనిచేస్తుందన్నారు. ఈ పరికరం సహాయంతో పంట పొలాల్లో కాండం తొలిచే పురుగువల్ల కలిగే నష్టాన్ని నివారించవచ్చన్నారు. కాండం తొలిచే పురుగు కాకుండా ఇతర కీటకాలు కూడా సామూహికంగా చిక్కుకుపోతాయని తెలిపారు. ఈ కొత్త వినూత్న పరికరం తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని, పర్యావరణానికి అనుకూలమైనదని అన్నారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాధ్, అధ్యాపక బృందం ఆనందం వ్యక్తం చేసి సుధాకర్‌రెడ్డిని అభినందించారు.



కాండం తొలిచే పురుగు నివారణ పరికరం నమూనా

నకిలీ ధ్రువీకరణ పత్రాలపై కొరడా

- వైకల్యం లేకున్నా సర్టిఫికెట్లు
- పెన్షన్ల కోసం కొందరు.. ట్రిబుల్ ఐటీ, ఇతర సంస్థల్లో ప్రవేశాల కోసం మరికొందరు
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.20వేల నుంచి రూ.25వేలు వసూలు
- పొరుగు జిల్లాల నుంచి భారీ ఎత్తున బోగస్ సర్టిఫికెట్లు డంపింగ్
- ఇలాంటి తప్పుడు సర్టిఫికెట్ల పునఃపరిశీలన



జిల్లాలో కొందరు వికలాంగుల పేరుతో సకలాంగులు అంగవైకల్య సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. ఉద్యోగాల కోసం, విద్యాసంస్థల్లో వికలాంగుల కోటాలో ప్రవేశం పొందేందుకు కొందరు అడ్డదారులు తొక్కడం చూశాం. అయితే సామాజిక పింఛన్లకోసమూ ఇప్పుడు సకలాంగులు సైతం వికలాంగులుగా మారిపోయారు. నిన్నటి దాకా కళ్లముందే పక్కింట్లో, ఎదురింట్లో అందరి మాదిరిగానే ఉంటున్న వారు కూడా ఇప్పుడు అంగవైకల్య పింఛన్లు పొందడాన్ని చూసి ఇరుగు పొరుగు వాళ్లే ఔరా.. అంటూ ముక్కున వేలేసుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఇవి ఎలా వచ్చాయంటూ ఆరా తీస్తే.. కళ్లు బైర్లు కమ్మే అసలు విషయం బయటికి వచ్చింది.



(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నేతలు ఏజంట్లుగా మారి ఒక్కో సర్టిఫికెట్‌ను రూ.20వేల నుంచి 25వేలు వసూలు చేసుకుని ఎలాంటి వైకల్యం లేకున్నా సరే.. పొరుగు జిల్లాల నుంచి సర్టిఫికెట్లు జిల్లాకు డంప్ చేయించారు. అలా తెచ్చిన సర్టిఫికెట్ల ద్వారా వారికి అంగవైకల్య పింఛను కూడా ఇప్పించారు. అంగవైకల్య పింఛన్లు రూ.3వేలు వచ్చేది. సరే.. మనం రూ.25వేలు ఖర్చు పెడితే ఒక సంవత్సరం పింఛను కాదనుకుంటే.. ఆ తరువాత నెలనెలా వచ్చేది ఆదాయమే కదా అని పలువురు వైసీపీ నేతలకు డబ్బులు ఇచ్చేసి సర్టిఫికెట్లు తెప్పించుకున్నారు. జిల్లాలో 2,67,495 పింఛన్లు ఉంటే అందులో వికలాంగుల పింఛన్లే 40వేల పైచిలుకు ఉండడం గమనార్హం. ఇక చంద్రబాబు సీఎం అయ్యాక ఈ పింఛను సొమ్ము రూ.6వేలకు పెంచడంతో.. ఈ సర్టిఫికెట్లకు మరింత డిమాండ్ పెరిగింది.

పింఛన్ల దుమారం

మనిషికి అన్ని అవయవాలు సక్రమంగా ఉండడం ఓ వరం. అయితే విధి వక్రీకరించడంతో కొందరకి వైకల్యం వస్తే.. జన్మతః మరికొందరు అంగవైకల్యంతో పుడుతున్నారు. అటువంటి వారిని ప్రభుత్వం ఆదుకుంటుంది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగాల్లో కోటాతో పాటు పూర్తి అంగవైకల్యం ఉన్న వారికి ప్రభుత్వం పెన్షన్ ఇచ్చి ఆదుకుంటూ ఉంటుంది. అయితే.. అక్రమాలకు అలవాటుపడ్డ కొందరు సకలాంగులు వికలాంగులుగా మారిపోయారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలోని పిడుగురాళ్ల, దొనకొండ, సత్తెనపల్లి, వినుకొండ, ఒంగోలు, గుంటూరు, మరికొన్ని ప్రాంతాల నుంచి కొందరు వైసీపీ నేతలు పింఛన్ల కోసమే భారీ ఎత్తున అంగవైకల్య సర్టిఫికెట్లను తెప్పించారంటారు. రూ.20వేల నుంచి 25వేలు డబ్బు తీసుకుని సర్టిఫికెట్లు తెప్పించి పింఛన్లు ఇప్పించారని తెలుస్తోంది. ఇలా పొరుగు జిల్లాల నుంచి అడ్డగోలుగా తెప్పించిన నకిలీ అంగవైకల్య సర్టిఫికెట్ల వ్యవహారం గ్రామ స్థాయిలో దుమారం రేపుతోంది. ఇటీవల నకిలీ ధ్రువీకరణ పత్రాల వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో ప్రధాన సంచికలో కథనాలు ప్రచురించింది. వారం క్రితం జరిగిన జడ్పీ సమావేశంలో కూడా నకిలీ సర్టిఫికెట్లపై దుమారం రేగింది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టుపై ప్రస్తావించారు. పొరుగు జిల్లాల మెడికల్ బోర్డు నుంచి పొందిన సదరం సర్టిఫికెట్లలో 3436 మందిని తిరిగి వారి వైకల్యాన్ని పునఃపరిశీలించేందుకు గాను కడప రిమ్స్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా ఆ వివరాలను ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు పంపించారు. ఏపీ వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో రిమ్స్ సూపరింటెండెంట్ కమిటీ వీటిని పునఃపరిశీలించనుంది. ఆర్థో, ఈఎన్‌టీ, ఇతర సర్టిఫికెట్లను ఈ బోర్డు పరిశీలిస్తుంది. అంగవైకల్యం లేకున్నా సర్టిఫికెట్లు తీసుకుని పింఛను తీసుకుంటున్న వారిలో ఇప్పుడు ఆందోళన మొదలైంది. సర్టిఫికెట్ల కోసం డబ్బులు తీసుకున్న వారి వద్దకు వెళితే మీకేం కాదు.. మేం చూసుకుంటాం రిమ్స్‌లో మావాళ్లే ఉండేది అని అభయమిస్తున్నారని చెబుతున్నారు.

ట్రిబుల్ ఐటీ ప్రవేశాల పేరిట..

అంగవైకల్య సర్టిఫికెట్ ఉంటే ట్రిబుల్ ఐటీలో వికలాంగుల కోటాలో ప్రవేశం పొందవచ్చు అంటూ వేంపల్లె మండలంలో రెవెన్యూలో పనిచేస్తున్న ఓ అధికారి భర్త బోగస్ వికలత్వ సర్టిఫికెట్లను తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు. రూ.25వేలు డబ్బులు తీసుకుని ఇప్పటికే పెద్ద ఎత్తున బోగస్ సర్టిఫికెట్లను తెచ్చారనే ప్రచారం ఉంది. రామిరెడ్డిపల్లె, అయ్యవారుపల్లెలో పలువురికి సర్టిఫికెట్లు తీసుకువచ్చి ట్రిబుల్ ఐటీలో సీట్ల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు అంగవైకల్య సర్టిఫికెట్లపై విచారణ జరుగుతుండడంతో అక్రమార్కుల్లో ముఖ్యంగా కొందరు వైసీపీ నేతల్లో అలజడి నెలకొంది.

'అన్నదాత సుఖీభవ' పథకం ఎప్పుడు? : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 15: ఆర్థికసాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు అమలు చేస్తారని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత నర్రెడ్డి తులసిరెడ్డి ప్రశ్నించారు. సోమవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకం బదులు తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని, ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ఏరువాక పౌర్ణమి కూడా అయిపోయిందని, వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు పైసాకూడా సాయం అందించలేదని ఆరోపించారు. రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఆర్థికసాయం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6000తో ముడిపెట్టకూడదన్నారు. అలాగే 2020 సెప్టెంబరు 1న జగన్ ప్రభుత్వం జీఓ 22 జారీ చేసిందన్నారు. ఈ జీఓ ప్రకారం వ్యవసాయ మోటర్లకు ప్రభుత్వం మీటర్లు బిగిస్తుందన్నారు. ఇప్పటికే జగన్ ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాలో బిగించిందన్నారు. ఈ జీఓ రైతు వ్యతిరేకమని కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, టీడీపీ అప్పట్లో చెప్పాయన్నారు. మీటర్లు బిగిస్తే పగలగొట్టండని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే జీఓ 22 రద్దుచేస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చి నెలదాటినా ఆ జీవో రద్దు ప్రస్తావన లేదన్నారు. శ్రీకాకుళంలో బిగించిన మీటర్లను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం పొడిగింపు : కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 15: వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా ఈ నెల 12న జీవో జారీ చేశారని కలెక్టర్ లోతేటి శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ స్కీం ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2 లక్షల విలువ చేసే వైద్య సేవలు అందుతాయని, ఇలా సంవత్సరంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. దీని ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్(ఇహెచ్ఎస్) తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఓపీ సేవలు పొందవచ్చని వివరించారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా రూ.1250లు చెల్లించి వచ్చే ఏడాది మార్చి నెల వరకు లబ్ధి పొందవచ్చన్నారు.

కోరలు చాస్తున్న డెంగ్యూ

- రోజురోజుకు విజృంభిస్తున్న జ్వరాలు
- ఇప్పటివరకు 81 డెంగ్యూ 3 మలేరియా కేసులు
- అనధికారికంగా ఇంకెన్నో...
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- మురికికూపాలుగా మున్సిపాలిటీలు
- ఆందోళనలో ప్రజలు





పీలేరులో చెత్తతో నిండిపోయిన అయ్యపునాయునిచెరువు సప్లయ్ ఛానల్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, మలేరియా కోరల్లో జిల్లా చిక్కుకుంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రజలు జ్వరాల బారిన పడి వేలాది రూపాయలు ఆసుపత్రులకు ఖర్చు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారమే.. జిల్లాలో ఆరు నెలల్లో 81 డెంగ్యూ, 3 మలేరియా కేసులు నిర్ధారణ అయ్యాయి. అనధికారికంగా ఎన్ని కేసులో చెప్పడం కష్టమే. జ్వరాల బారిన పడిన వారితో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇదే సమయంలో మున్సిపాలిటీలు మురికికూపాలుగా మారడంతో జిల్లాలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఎక్కడ చూసినా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోజురోజుకు జ్వరాల తీవ్రత పెరుగుతూ ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకుని జ్వరాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విజృంభిస్తున్న డెంగ్యూ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1281 డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా అందులో 81 కేసులు నిర్ధారణ అయ్యాయి. ఈ లెక్కన అనుమానిత కేసుల్లో 7 శాతం వరకు నిర్ధారణ అయినట్లు. ఇది కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇంకెన్ని కేసులు నమోదయ్యాయో చెప్పడం కష్టమే. ఈ స్థాయిలో డెంగ్యూ ప్రబలడం.. ప్రమాదకర స్థితిగానే చెప్పవచ్చు. ఒకటి రెండు రోజులు జ్వరం రాగానే జనాలు భయంతో ప్రైవేటు ఆసుపత్రులకు పరుగెడుతున్నారు. వచ్చింది ఏ జ్వరమో తెలియక మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ నిర్ధారిత పరీక్షల కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. నిర్ధారణ అయిన తర్వాత చికిత్స తడిసి మోపెడు అవుతోంది. రోగి కనీసం రెండు, మూడు రోజుల పాటు ఆసుపత్రిలో అడ్మిట్ కావాల్సి వస్తోంది. డెంగ్యూ జ్వరం బారిన పడిన వాళ్లు.. ఎంత తక్కువ అనుకున్నా ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే రూ.10 వేల వరకు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది. దీనివల్ల పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో 1,32,008 మంది జ్వరపీడితులకు మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా అందులో 3 కేసులు నిర్ధారణ అయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేసే నిర్ధారణ పరీక్షలను పరిగణలోకి తీసుకుంటే.. ఈ లెక్క చాలా ఎక్కువగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. మదనపల్లె డివిజన్‌లో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 468 ఎలీసా పరీక్షలు నిర్వహించారు. అందులో 5 డెంగ్యూగా నిర్ధారణ అయ్యాయి. 3107 మలేరియా పరీక్షలు నిర్వహించగా ఒకటి కూడా నిర్ధారణ కాలేదు.

విజృంభిస్తున్న జ్వరాలు

నెల రోజులుగా నైరుతి రుతుపవనాలు, తుఫాన్ కారణంగా వర్షాలు పడుతుండడంతో.. దోమలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఫలితంగా జిల్లాలో ఏ పల్లె, పట్టణం చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. డెంగ్యూ, మలేరియా జ్వరాలతో పాటు టైఫాయిడ్ కూడా ప్రమాదకర స్థాయిలో కనిపిస్తోంది. ఎక్కువగా చిన్నపిల్లలు ఈ జ్వరాల బారినపడుతుండడం ఆందోళన కలిగించే అంశమని తల్లిదండ్రులు వాపోతున్నారు.

దోమల నివారణ చర్యలెక్కడ

జిల్లా ఈ విధంగా జ్వరాల కోరల్లో చిక్కుకుంటే దోమల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చెబుతున్న ప్రకారం జిల్లాలో జూన్ నెలను దోమల నివారణా నెలగా ప్రకటించి చర్యలు చేపట్టారు. అయితే క్షేత్రస్థాయిలో దోమల నివారణకు చర్యలు తీసుకున్న ఆనవాళ్లు కనిపించడం లేదు. రాయచోటి మునిసిపాలిటీ కొత్తపేట రామాపురంలో పలువురు చిన్నారులు డెంగ్యూ బారిన పడ్డారు. ఆరేడు నెలలుగా దోమల నివారణకు మునిసిపాలిటీ అధికారులు, సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలువలు మురికి నీటితో ఉండడంతో దోమలు నిల్వ ఉంటున్నాయని పేర్కొంటున్నారు. ఎప్పుడో నెలకు ఒకసారి కాలువలు శుభ్రం చేస్తారని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇళ్లలో దోమల బెడద తట్టుకోలేకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి పట్టణమంతా ఉందనే చెప్పవచ్చు. ప్రతి రోజూ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితే గ్రామ పంచాయతీలలో కనిపిస్తోంది. మురికినీటి కాలువలు శుభ్రం చేయడం లేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. దీనివల్ల దోమలు పెరుగుతున్నాయి. అదే విధంగా జ్వరాలు కూడా పెరుగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

15 రోజులకు ఒకసారి కాలువలు శుభ్రం చేస్తున్నారు..

మాది పీలేరు పట్టణం. మా వీధిలో 15 రోజులకు ఒకసారి కాలువలు శుభ్రం చేస్తున్నారు. దీంతో దోమలు విపరీతంగా ఉంటున్నాయి. రెండు రోజుల నుంచి చలి జ్వరంతో బాధపడుతున్నా.

- రమణ, జ్వరపీడితుడు, పీలేరు



రాత్రి హంస వాహనంపై సౌమ్యనాథస్వామి




హంస వాహనంపై సౌమ్యనాథుడు


నందలూరు, జూలై 15: నందలూరు సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం ఉదయం పల్లకిసేవలో ఆలయ ప్రధాన అర్చకులు సునీల్‌స్వామి బృందం ఆధ్వర్యంలో సౌమ్యనాథ స్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఊరేగింపులో మహిళలు నిర్వహించిన కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి హంసవాహనంపై సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేష అలంకరణలో మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రమణ్యం, చక్రాల రామసుబ్బన్న, జంగంశెట్టి సుబ్బయ్య, మోడపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు మంగళవారం ఉదయం పల్లకిసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి సింహవాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తెలిపారు.



ఉదయం పల్లకీసేవలో సౌమ్యనాథుడు



అక్రమ కొళాయిల దందా

- వేలల్లో కమర్షియల్ బిల్డింగులు... వందల్లో కొళాయి కనెక్షన్లు
- సిబ్బంది చేతివాటం.. అధికారుల అవినీతి
- ఎర్రగుంట్ల నగర పంచాయతీ ఆదాయానికి భారీగా గండి
- ఈ ప్రభుత్వంలోనైనా చర్యలు తీసుకుంటారా...?

ఎర్రగుంట్ల, జూలై 15: స్థానిక నగర పంచాయతీలో అక్రమ కొళాయిల కనెక్షన్ల దందా కొనసాగుతోంది. సుమారు 2వేల అక్రమ కొళాయిలతో పాటు వాటికి మోటార్లు కూడా బిగించుకుని భారీగా నీరు వారుడుతు న్నారు. ఇటీవల ఈ అక్రమ దందా మరింతగా పెరిగినట్లు తెలుస్తోంది. దీనికి తోడు సాధారణ కొళాయి కనెక్షన్లు తీసుకుని కమర్షియల్‌గా వాడుతున్నారు. దీంతో నగరపంచాయతీకి భారీగా నష్టం వాటిల్లు తోం ది. వీటికి తోడు వాటర్‌సర్వీసింగ్ సెంటర్లు, పెద్ద పెద్ద భవంతులకు అక్రమంగా కొళాయిలు వాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



విచారణ చేసి రెగ్యులరైజ్ చేస్తాం

ఎర్రగుంట్ల నగర పంచాయతీలో అక్రమంగా కొళాయి కనెక్షన్లు ఉంటే చర్యలు తీసుకుంటాం. త్వరలో అన్ని వీధుల్లోని కొళాయిలను పరిశీ లించి.. తగిన చర్యలు తీసుకుని రెగ్యులరైజ్ చేస్తాం. అలాగే సాధారణ కనెక్షన్స్ తీసుకుని కమర్షియల్‌గా వినియోగిస్తున్న వాటన్నింటిని కూడా రివైజ్ చేస్తాం. నీటి వినియోగంపై మీటర్లను కూడా ఏర్పాటు చేస్తాం. అప్పుడు ఎవరెంత నీటిని వినియోగించింది తెలుస్తుంది. దాన్నిబట్టి కమర్షియల్ కింద లెక్కకడతాం.

-రామక్రిష్ణయ్య, కమిషనర్ ఎర్రగుంట్ల

ఎర్రగుంట్లలోని ఇందిరానగర్, పుష్పగిరి మాన్యంలోనే 400 వరకు అక్రమ కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. వీటి జోలికి వెళ్లకుండా ఓ కౌన్సిలర్, ఓ అధికారి అనధికారికంగా ఆదేశాలు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో ఇక్కడి అక్రమ కొళాయి కనెక్షన్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఇక చాలా చోట్ల కమర్షియల్ కనెక్షన్లు ఉండాల్సి వుంది. కానీ ప్రజాప్రతినిధుల రెకమెండేషన్లు, అధికారుల అవినీతి, నిర్లక్ష్యంతో సాధారణ కనెక్షన్లు తీసుకున్నారు. ముఖ్యంగా మోటార్ సైకిళ్ల సర్వీసింగ్ పాయింట్లు, ఇతర దుకాణ దారులు, వాణిజ్య కాంప్లెక్స్ ఇలా అనేకం ఉన్నాయి. వీళ్ల బోరునీరు కాకుండా నేరుగా తాగునీటి మెయిన్ పైప్‌లైన్‌కు కనెక్షన్ తీసుకుని నీటిని వినియోగిస్తు న్నట్లు సమాచారం. దీంతో తాగునీరు భారీగా వృధా అవుతోంది.

డిపాజిట్లు, ట్యాక్స్ రూపంలో భారీగా నష్టం

కమర్షియల్ కొళాయిలకు డిపాజిట్ రూ.10వేలు చేయాల్సి ఉంటుంది. అలాగే సంవత్సరానికి రూ.1440 పన్ను కట్టాల్సి వుంది. సాధారణ కనెక్షన్‌కు రూ.4200 డిపాజిట్, సంవత్సరానికి రూ.720 పన్ను కట్టాల్సి వుంది. అలాగే భారీ ఇళ్లకు రూ.6900 డిపాజిట్ కట్టాల్సి వుంది. ఎర్రగుంట్ల నగరపంచాయతీలో 10880 ఇళ్లు ఉండగా.. కేవలం 5500 కొళాయి కనెన్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో భారీ భవనాలు చాలా



ఉన్నాయి. వీటన్నింటిలో చాలా వరకు సాధారణ కొళాయి కనెక్షన్లకు డిపాజిట్లు చెల్లించి పన్ను కూడా రూ.720 కడుతున్నారు. దీంతో నగర పంచాయతీ ఆదాయానికి డిపాజిట్ల రూపంలో, పన్ను రూపంలో భారీగా గండిపడుతోంది.

సిబ్బంది చేతివాటం...అధికారుల నిర్లక్ష్యం

ఎర్రగుంట్ల నగర పంచాయతీలో సుమారు 2 వేల వరకు అక్రమ కొళాయిలు ఉన్నట్లు సర్వేలో తేలింది. అయితే ఈ కొళాయిలన్నీ నగర పంచాయతీ సిబ్బంది కొన్నింటిని.. అధికారుల, ప్రజాప్రతినిధుల మౌఖిక ఆదేశాలతో ఏర్పాటు చేసినట్లు సమాచారం. అలాగే కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతూ ఇష్టానుసారం కొళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో ఓ ఫెవికాల్ అధికారి దందా మరి ఎక్కువైందన్న విమర్శలు కూడా లేకపోలేదు. ఇతను అవినీతికి కేర్‌ఆఫ్ అడ్రస్‌గా మారి నగర పంచాయతీలో చక్రం తిప్పుతున్నారనే విమర్శలు కూడా లేకపోలేదు. ఇక సిబ్బంది ఆమ్యామ్యాలు తీసుకుని నేరుగా కొళాయి కనెక్షన్లు ఇచ్చినట్లు సమాచారం. మరికొన్ని లబ్ధిదారులు డిపాజిట్లు ఇచ్చినా వారు కార్యాలయానికి చెల్లించకుండా కాజేసిన సంఘటనలు ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో అవినీతికి అడ్డాగా నగరపంచాయతీ కార్యాలయం మారిందని, ఈ ప్రభుత్వంలోనైనా అక్రమ కొళాయిల దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి అండర్-19 మెన్ జోనల్ క్రికెట్ పోటీలు

కడప (స్పోర్ట్స్), జూలై 15: కడపలో ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు ఏసీఏ అండర్-19 మెన్ ఇంటర్ జోనల్ స్థాయి వన్‌డే క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఇందులో కడప, రెస్ట్ ఆఫ్ సౌత్, క్రిష్ణా, రెస్ట్‌ఆఫ్ సెంట్రల్, విశాఖపట్నం, రెస్ట్ ఆఫ్ నార్త్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్, సభ్యుడు ఎల్.మునికుమార్‌రెడ్డి తెలిపారు. రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియం, కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం క్రికెట్ స్టేడియంలలో ఈ మ్యాచ్‌లు ఆడనున్నట్లు వారు తెలిపారు.

తేదీ	ఏపీ జట్ల మధ్య పోటీ	వేదిక
16న	కడప- రెస్ట్ ఆఫ్ సౌత్	వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియం
16న	క్రిష్ణా- రెస్ట్ ఆఫ్ సెంట్రల్	కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ స్టేడియం
16న	విశాఖపట్నం-రెస్ట్ ఆఫ్ నార్త్	కేఓఆర్‌ఎం క్రికెట్ స్టేడియం
17న	కడప - క్రిష్ణా	వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియం
17న	రెస్ట్‌ఆఫ్‌సెంట్రల్ - రెస్ట్‌ఆఫ్‌నార్త్	కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ స్టేడియం
17న	విశాఖపట్నం - రెస్ట్‌ఆఫ్‌నార్త్	కేఓఆర్‌ఎం క్రికెట్ స్టేడియం
18న	కడప- విశాఖపట్నం	వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియం
18న	రెస్ట్‌ఆఫ్‌సెంట్రల్-రెస్ట్ ఆఫ్‌సౌత్	కేఎస్‌ఆర్‌ఎం- క్రికెట్ స్టేడియం
18న	క్రిష్ణా- రెస్ట్‌ఆఫ్ నార్త్	కేఓఆర్‌ఎం క్రికెట్ స్టేడియం
19న	ఆటకు విశ్రాంతి	
20న	విశాఖపట్నం- రెస్ట్‌ఆఫ్ సెంట్రల్	వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియం
20న	కడప- రెస్ట్‌ఆఫ్ నార్త్	కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ స్టేడియం
20న	క్రిష్ణా- రెస్ట్ ఆఫ్ సౌత్	కేఓఆర్‌ఎం క్రికెట్ స్టేడియం
21న	రెస్ట్ ఆఫ్ నార్త్- రెస్ట్‌ఆఫ్ సౌత్	వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియం
21న	క్రిష్ణా- విశాఖపట్నం	కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ స్టేడియం
21న	కడప- రెస్ట్ ఆఫ్ సెంట్రల్	కేఓఆర్‌ఎం క్రికెట్ స్టేడియం

19న జిల్లా బీచ్ కబడ్డీ ఎంపిక పోటీలు

కడప (స్పోర్ట్స్) జూలై 15: ఉమ్మడి కడప జిల్లా పురుషుల, మహిళల బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నగర శివారు ప్రాంత యోగివేమన యూనివర్సిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఓ.రవీంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీ ఆర్.వెంకటసుబ్బయ్య, వర్కింగ్ సెక్రటరీ టి.శ్రీవాణి, తెలిపారు. ఎంపికైన జిల్లా టీమ్ వచ్చే ఆగస్టు 2, 3, 4, తేదీలలో నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలం ఇందుకూరుపేటలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనాల్సివుందన్నారు. ఏదేని ఇతర వివరాలకు 6304309294, 9949304160 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వం మారినా కార్యాలయాల్లో మారని తీరు

- జిల్లా ఆసుపత్రిలో వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ వార్డుగా బోర్డు



ప్రొద్దుటూరు, జూలై 15: టీడీపీ ప్రభుత్వం వచ్చి నెల రోజులు దాటినా.. ఇంకా చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి బొమ్మలు దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ పథకాల పేర్లు మారినా... గత వైసీపీ ప్రభుత్వంలో పేర్లను ఇంకా కొనసాగిస్తున్నారు. ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డు ఇంకా డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ వార్డుగా బోర్డు కొనసాగుతోంది. ఆ బోర్డుకు ఇంకా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మనే ఉంది. దీన్ని ఆసుపత్రి అధికారులు తొలగించలేదు. ఇప్పటికైనా అధికారులు ఆసుపత్రిలో ఉన్న గత ప్రభుత్వానికి సంబం ధించిన బోర్డులు తొలగించే చర్యలు చేపట్టాల్సి వుంది.

గ్యారెంటీ పెన్షన్ స్కీం చట్టం రద్దు చేయాలి

- ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు



మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 15: ఉద్యోగుల మనోభావాలకు వ్యతిరేకంగా ఉన్న గ్యారెం టీ పెన్షన్ స్కీం గెజిట్ ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం ఎస్టీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీపీఎస్ రద్దు విషయం పరిశీలిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దాని గురించి పరిశీలించేలోపు అధికారులు గ్యారంటీ పెన్షన్ స్కీం అమలుపరిచే ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే గ్యారంటీ పెన్షన్‌స్కీం ఉత్తర్వులు రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసి పాత పింఛను విధానానికి విధి విధానాలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, నాగరాజు, చంద్రశేఖర్, సలాం, శ్రీరామ్, ఎల్‌వీ శంకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో శ్రద్ధ చుపాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి కలెక్టరేట్, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలపై శ్రద్ధపెట్టి పరిష్కారించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల కార్యక్ర మంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రభు త్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలపై క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి సమస్యను పరిష్కారించాల్సిన బాధ్యత అధికారులపై వుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్య నారాయణ, ఎస్‌డీసీ రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ

రాయచోటిటౌన్, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్ కమల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమాన్ని నిర్వహించి.. 58 మంది ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యా దులను చట్ట పరిధిలో విచారించి త్వరిగతిన పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదులను పరిశీలించి చట్ట పరిధిలో విచారించి త్వరిగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

రైతాంగ విద్యుత్తు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జమ్మలమడుగు, జూలై 15: రైతుల విద్యుత్తు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి జిల్లా విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు, దేవగుడి సబ్‌స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్తు లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పతంగే రామన్న రావు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పనులు చేయని అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్తు సమస్యలు తలెత్తిన వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు పనులు చేసేటప్పుడు భద్రత నియమాలు విధిగా పాటించాలని ఆదేశించారు. జమ్మలమడుగు ప్రాంతంలో విద్యుత్తు అంతరాయాలు అధికంగా ఉన్నాయని, ఇకమీదట ఎటువంటి పరిస్థితుల్లో పునరావృతం కాకూడదని హెచ్చరించారు. విద్యుత్తు లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయాలను అరికట్టాలన్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడైనా లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైనన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని విద్యుత్తు ప్రమాదాలపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారుడు తమ



సబ్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ

విద్యుత్తు సమస్యలపై కార్యాలయానికి వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలోని సిబ్బంది, అధికారులు వారితో మమేకమై మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలన్నారు. విద్యుత్తు బకాయిల వసూళ్లపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజగోపాల్, ఏఈ రాజబాబు, రామకృష్ణయ్య, శ్రీనివాసవర్మ, ఓబులేసు, సీతాంబరరెడ్డి, జూనియర్ ఇంజనీర్లు, జేఏవోలు విజయబాబు, అకౌంట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ అధికారులు

సిద్దవటం, జూలై 15: మండల పరిధిలోని లంకమల్ల అభయారణ్యంలో జిల్లా అటవీ శాఖాధికారి పీవీ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు సిద్దవటం ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి ఆధ్వర్యంలో ఫారెస్ట్ స్పెషల్ స్పోర్ట్స్ టీమ్ కూంబింగ్ చేపట్టారు. కొంతమంది ఎర్రచందనం స్మగ్లర్లు చెట్లను నరుకుతుండగా దాడి చేయడంతో పారిపోయారని, నరికివేసిన 18 ఎర్రచందనం దుంగలను స్వాధీ నం చేసుకున్నారు. స్మగ్లర్ల కోసం స్పెషల్ టీం గాలింపు చర్యలు చేపడుతు న్నట్లు డిప్యూటీ రేంజి అధికారి ఓబులేశు తెలియజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో పెంచలరెడ్డి, ఏబీవో హైమావతి, స్పెషల్ టీమ్ పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య



మృతి చెందిన బాలనాగమ్మ (ఫైల్‌ఫోటో)

ప్రొద్దుటూరు క్రైం, జూలై 15: స్థానిక నేతాజీనగర్‌కు చెందిన గుట్టమీది బాలనాగమ్మ (60) అనే వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. ఆమె వియ్యంకుడు జయచంద్రుడు పెట్రోలు పోసి నిప్పంటించడంతో మృతి చెందినట్లు ప్రొద్దుటూరు డీఎస్పీ మునిశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... బాలనాగమ్మ కుమారుడు సురేష్ స్థానికంగా పనిచేసేవాడు. ఇతను జయచంద్రుడు కుమార్తెను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని అతను సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చి బాలనాగమ్మపై పెట్రోలు పోసి అంటించడంతో తీవ్ర గాయాలతో అమె అక్కడికక్కడే మృతి చెందింది. కాగా నిందితుడు జయచంద్రుడుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వ్యక్తి మృతి



మన్యం అశోక్ మృతదేహం

గోపవరం, జూలై 15: మండలంలోని రెండో కాలనీకి చెందిన మన్యం అశోక్ (29) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సోమ వారం సాయంత్రం 7గంటలకు తన గృహంలో విద్యుత్ వైర్లు మరమ్మత్తు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే వైద్యం కోసం కుటుంబ సభ్యులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతు నికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మానవతాదృక్పథంతో ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకో వాలని పలువురు కోరుతున్నారు.

స్థలం విషయమై ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

చెన్నూరు, జూలై 15 : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో ఓ స్థలం విషయమై జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేర కు.. ఉప్పరపల్లెకు చెందిన చెన్నయ్యగారి సుబ్బరాయుడుకు తన సమీప బంధువులకు ఓస్థలం విషయంలో వివాదం ఉంది. ఈ క్రమంలో సోమవా రం ఇదే విషయమై వాగ్వివాదం జరిగి గొడవకు దారితీసింది. దీంతో సుబ్బరాయుడుపై అతని బంధువులు దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా రిమ్స్‌కు తరలించి.. పోలీసులు కేసు నమోదు చేశారు. గొడవ జరిగిన ఉప్పరపల్లె గ్రామాన్ని స్థానిక సీఐ నారాయణయాదవ్ పరిశీలించారు. అక్కడి వారితో మాట్లాడి అనవసరంగా గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

కోదండరాముని స్థలంపై అక్రమార్కుల కన్ను

- రూ.50 లక్షల విలువైన స్థలం కబ్జా యత్నం



కోదండరాముడి కాలనీలో ఆక్రమించుకోవాలని చూస్తున్న ఖాళీ స్థలం

ఒంటిమిట్ట, జూలై 15 : కోదండరాముడి కల్యాణవేదిక సమీపంలో ఉన్న కాలనీలో ఖాళీగా ఉన్న 10 సెంట్ల స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. 2015లో కోదండరామాలయాన్ని రాష్ట్ర ఆలయంగా ప్రభుత్వం గుర్తించడంతో ఆలయం చుట్టుపక్కల ఉన్న ఇళ్లను ఖాళీ చేయించి వారికి కల్యాణవేదిక ప్రాంతంలో ఇళ్లను కేటాయించి వారిని అక్కడికి తరలించారు. ఆ కాలనీలో ఖాళీగా ఉన్న 10 సెంట్ల స్థలంపై ఇటీవల అక్రమార్కుల కన్ను పడింది. అక్కడ ప్రస్తుతం సెంటు 5 లక్షల రూపాయలు ఉంది. దీంతో 10 సెంట్ల విలువ 50 లక్షల వరకు ఉంటుంది. కాలనీలో ఇళ్లకు కేటాయించగా మిగిలిన ఆ 10 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం అలాగే ఉంచారు. అయితే సంవత్సరాల తరబడి ఆ స్థలం గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికంగా ఉంటున్న ఓ వ్యక్తి ఆ స్థలాన్ని వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ చెందిన ఓ వ్యక్తి ఆ స్థలం నాదేనని, అధికారులు నాకు కేటాయించారని అక్కడికి రావడంతో అక్కడ ఉన్న వ్యక్తి ఈ స్థలం నాదేనని అడ్డుకున్నాడు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనిపై టీటీడీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. ఏది ఏమైనా కోదండరాముని స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూడడం పట్ల రామభక్తులతో పాటు మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. కోదండరాముడి ఆస్తులు కాపాడి అన్యాక్రాంతం కాకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సర్వజన ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్సీ

పులివెందుల టౌన్, జూలై 15: పులివెందులలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ బ్లాక్, ఎమర్జెన్సీ బ్లాక్‌లను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్లతో సమావేశమై వైద్యసదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ విఘ్నేశ్వరరావు తో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సరిపడా ఉన్నారా తదితర అంశాలను వివరించారు. మెడికల్ కళాశాలకు సంబంధించిన పనులపై ఆరాతీశారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్సీ సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి

● కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 15: కడప రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కడప రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి రైల్వే అధికారులతో రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కడప రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతుండటం సంతోషకరమన్నారు. అయితే ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కడప స్టేషన్ మేనేజరు శేఖర్‌కుమార్, రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్దన్ కమిటి సభ్యుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను నమోదు చేసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని కమిటి సభ్యులకు తెలిపారు. అలాగే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని అలాగే మెరుగైన వసతులు, సదుపాయాలను ప్రయాణికులకు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటి సభ్యులు లక్ష్మణ్‌రావు, క్రిష్టారెడ్డి, ఎం.శ్రీనివాసులు, ప్రవీణ్, కామేశ్వర్‌రావు, శ్రీనివాసులు, అమృత్ పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్ మేనేజరుతో మాట్లాడుతున్న కడప రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు

22న డిగ్రీ విద్యార్థులకు వైవా

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 15 : వైవీయూ పరిధిలో గల అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు వైవా - వోస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టు ఫీజు చెల్లించిన విద్యార్థులు వైవీ వోస్‌కు కడప నగరం నాగార్జున మహిళా డిగ్రీకళాశాలలో హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టు రికార్డు, హార్డ్‌కాపీని సమర్పించాలన్నారు. అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సమాచారం అందించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

సింహాద్రిపురం, జూలై 15: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి ఒకరూ కృషి చేయాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు పేర్కొన్నారు. సోమవారం చేపట్టిన ప్రజా సమస్యల వేదికలో సమస్యలపై కొందరు తహసీల్దార్‌కు వినతి పత్రాలు సమర్పించారు. వాటికి సంబంధించి త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే భూ రీసర్వేలో తలెత్తిన సమస్యలను కొందరు రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. మండల అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి

కడప (మారుతీనగర్), జూలై 15: దళితుడైన కదిరి ప్రభాకర్‌పై వేడి నూనె పోసి గాయాలపాలు చేసిన గజ్జల సుబ్బారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి మాచునూరు హరికృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రభాకర్‌ను సోమవారం హరికృష్ణ కలిశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడారు.పెన్నపేరూరుకు చెందిన ప్రభాకర్ బం ధువు మరణించడంతో అంత్యక్రియలకు హాజరైన కదిరి ప్రభాకర్ కాసింత బడలికతో ఇంటికి చేరే క్రమంలో గజ్జల సుబ్బారెడ్డి ఇంటి అరుగుపై కాసేపు సేదతీరుతుండగా సుబ్బారెడ్డి కోపోద్రిక్తుడై ప్రభాకర్‌ను కులం పేరుతో దూషిస్తూ పక్కనే ఉన్న అంగడిలోని వేడి నూనె అతని ఒంటిపై పోయడం దారుణమన్నారు. సుబ్బారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, నాయకులు వాసు, సుబాష్, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు దుర్మార్గం: టీడీపీ

కడప (ఎడ్యుకేషన్), జూలై 15 : దళితులపై దాడులు దుర్మార్గపు చర్య అని, ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని టీడీపీ నాయకుడు పందింటి డేవిడ్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం పెన్నాపేరూరు గ్రామం ఎస్సీ మాల కులానికి చెందిన కదిరి ప్రభాకర్ అనే వ్యక్తిపై నూనె పోసిన వెంకటసుబ్బారెడ్డిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీల రక్షణ కోసం ఎన్ని చట్టాలు తెచ్చినా ఇం కా దళితులపై దాడులు జరుగుతునే ఉన్నాయన్నారు. అ రుగుపై కూర్చున్నాడని అతన్ని కులం పేరుతో దూషించి వేడి నూనె పోయడం దుర్మార్గమన్నారు. తక్షణం తనపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అలాగే బాధితునికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో గడ్డం శ్రీనివాసులు, చిన్నా పాల్గొన్నారు.

'కఠినంగా శిక్షించాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 15 : ప్రభాకర్‌పై వేడి నూనెతో దాడి చేసిన సుబ్బారెడ్డిపై హత్యాయత్నం కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత ఫోరం చైర్మన్ కిశోర్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కదిరి ప్రభాకర్‌ను ఆయన పరామర్శించారు.

'తల్లికి వందనం' అమలు ఎప్పుడు?

● మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

కమలాపురం రూరల్, జూలై 15:ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా వారందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ ఏమైందని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పేర్కొ న్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ గొప్పగా చెప్పుకున్న సూపర్‌సిక్స్‌లో కూడా ఆ పథకాన్ని చూపారన్నారు. ము ఖ్యమంత్రి జగన్ పై అక్రమ కేసు పెట్టడం ధర్మమా అని ప్రశ్నించారు. మూడేళ్ల తరువాత కేసు నమోదు చే యడం ఏమిటని ఆయన పేర్కొన్నారు.

18న మండల మీట్

పులివెందుల రూరల్, జూలై 15:మండల సర్వసభ్య సమావేశం 18న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఉదయం 10.30గంటలకు ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయ ఏఓపై విచారణ

పెండ్లిమర్రి, జూలై 15: ఎంపీడీఓ కార్యాలయం ఏఓ అల్తాఫ్ హుస్సేన్‌పై విచారణ చేశారు. సోమవారం కడప డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య ఈ విచారణ చేపట్టారు. ఎన్నికల సమయంలో ఎన్నికల తర్వాత టీడీపీకి వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడని మండల టీడీపీ నాయకులు జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనపై విచారణ చేస నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు.

విద్యార్థిని మృతికి కారకులను శిక్షించాలి: ఆర్ఎస్‌యూ



నివాళులర్పిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప(ఎడ్యుకేషన్), జూలై 15 : విద్యార్థిని వాసంతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్‌యూ నాయకుడు కె.హరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో వాసంతి ఆత్మకు శాంతి కలగాలని విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గం పగిడాల మండలం ముచ్చుమర్రి గ్రా మంలో అభంశుభం తెలియని చిన్నారి వాసంతిని కిరాతకంగా అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. చిన్నారి వాసంతి మృతదేహం ఇంతవరకు ఆచూకీ లభించకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం దీనిపై విచారణ జరిపించి చిన్నారి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టలు విద్యార్థులు, ఆర్ఎస్‌యూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలి

పులివెందుల టౌన్, జూలై 15: ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని పులివెందుల ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలోని విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సీఐ మాట్లాడుతూ బైకు రైడర్లు, పిల్లాన్ రైడర్లు హెల్మెట్ ధరించకపోవడం, కారు డ్రైవర్లు సీట్ బెల్టు వినియోగించకపోవడం వల్ల చాలా మంది రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మరి కొంతమంది తక్కువ దూరమే కదా అని హెల్మెట్ ఉన్నా పెట్టుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అలాచేయకుండా ఇంటి నుంచి బయటకు వెళితే హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మిగతా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి, ట్రిపుల్‌రైడింగ్‌నకు దూరంగా ఉండాలని తెలిపారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సురేష్‌రెడ్డి

మెటీరియల్ లేకపోవడంతోనే మార్చలేదు: ఏఈ

చెన్నూరు, జూలై 15 : చెన్నూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నాలుగు నెలలుగా కేబుల్ కానీ, వైరు కానీ లేకపోవడం వల్లే విద్యుత్ స్తంభాలకు తెగి పడి ఉన్న తీగలను మార్చలేదని, అవి వచ్చిన వెంటనే మారుస్తామని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ప్రాణాలు పోతే కానీ పట్టించుకోరా..' అన్న కథనంపై స్పందించారు. నిధులు లేక వైర్లను తెప్పించలేకపోయామన్నారు. అవి రాగానే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా దెబ్బతిన్న వైర్ల చోట కొత్త వైర్లు లేదా కేబుల్ వేస్తామన్నారు. చాలా రోజుల కిందట ఎస్టిమేషన్లు మంజూరు అయినా వైర్లను డ్రా చేయలేని పరిస్థితి ఉందన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే వనంవీధిలో ఇనుపస్తంభానికి సంబంధించిన వైర్లను కూడా పక్కనే పాతిన సిమెంటు స్తంభానికి వేసి సమస్య లేకుండా చూస్తామన్నారు.

గోపూజతో సకల శుభాలు

వల్లూరు, జూలై 15 : గోపూజతో సకల శుభాలు కలుగుతాయని విజయకనకదుర్గ ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వారం రోజులుగా వివిధ వ్యక్తుల చేత భాగవత సప్తాహాన్ని భక్తులకు వినిపించారు. సోమవారం విజయ కనకదుర్గా ఆలయంలో జరుగుతున్న భాగవత సప్తాహం లో భాగంగా చివరి రోజైన సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం 5గంటలకు ఆలయంలోని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 6 గంటల నుంచి ఆలయం లోపల ఉన్న కనకదుర్గ అమ్మవారు, శివుడు, క్షేత్రమాత తదితర దేవతా మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అంతకు ముందు గోపూజ నిర్వహించి గోమాతను పసుపుకుంకుమలతో అలంకరించారు. అనంతరం మేళతాళాల మధ్య ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం భాగవత సప్తాహ ముగింపు కార్యక్రమం చేశారు. మంత్రపుష్పం నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు.


గోవుకు పూజ చేస్తున్న భక్తులు

సీనియర్ హాకీ క్రీడాకారులకు సన్మానం

పులివెందుల రూరల్, జూలై 15: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం సా యంత్రం 50 మంది సీనియ ర్ హాకీ క్రీడాకారులను సన్మానించారు. కడప హాకీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ రవిచంద్ర, జిల్లా సెక్రటరీ శేఖర్, సీనియర్ అండ్ మాజీ కడప హాకీ ప్రెసిడెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ వీరంతా జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపి పులివెందులకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారన్నారు. పులివెందులలో జరుగుతున్న 2వ సౌత్‌జోన్ జూనియర్ చాంపియన్‌షిప్-2024 పోటీల సందర్భంగా వీరిని సన్మానించినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 15: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కడప ఎర్రముక్కపల్లె సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నానిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ పెండింగు వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా జీతం పడేలా చూడాలన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.


నిరసన తెలుపుతున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

రోడ్డుపై కొండచిలువ... భయంతో పరిగెత్తిన జనం

చెన్నూరు, జూలై 15 : మండల పరిధిలోని చక్కెర కర్మాగారానికి వెళ్లే రోడ్డు పక్కన కొండచిలువ కనిపించడంతో జనం పరుగులు తీశారు. వాహనాల చెకింగ్‌కు వచ్చిన చెన్నూరు సీఐ నారాయణ యాదవ్ ఫారెస్టు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కాగా కొందరు స్థానికులను అక్కడే ఉంచి ఫారెస్టు వాళ్లు వచ్చే వరకు ఉండాలని వారికి తెలిపారు.


గదిలో చుట్టుకుని ఉన్న కొండచిలువ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను పునరుద్ధరించాలి

● కలెక్టరేట్ ఎదుట జేసీఐపీ ధర్నా

కడప (మారుతీనగర్), జూలై 15:ఎస్సీఎస్టీబీసీమైనార్టీ కార్పొరేషన్లను పునరుద్ధరించాలని జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ (జేసీఐపీ) జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అవ్వారుతో పాటు రజక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లయ్య, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోళ్లపాటి మాతయ్యబాబు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ సమన్వయకర్త సంగటి మనోహర్, దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు బీసీ గంగులు, జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ నగర అధ్యక్షుడు జి. జయరామ్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం గత పాలక ప్రభుత్వాలు సంబంధిత కార్పొరేషన్ల ద్వారా రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాగా గత వైసీపీ ప్రభుత్వం మరో ఆలోచనే లేకుండా ఆయా కార్పొరేషన్‌లలో చిల్లి గవ్వ కూడా విదల్చకుండా నిలిపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అణగారిన వర్గాలు తీవ్ర మనోవేదనలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు త్వరితగతిన స్పందించి తిరిగి ఆయా కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఆయా కార్పొరేషన్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి రాయితీతో కూడిన సబ్సిడీ రుణాలు మరోమారు ప్రవేశపెట్టి ఆ వర్గాల వారికి ఉపాధి కల్పించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్‌లలోని నిధులను సైతం నవరత్నాలకు మళ్లించి అణగారిని వర్గాల ప్రజల నోట్లో మట్టికొట్టిందని నిప్పులు చెరిగారు. దీంతోనే వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. ప్రస్తుత పాలకులు ఆ సంగతి గుర్తెరిగి పేదల అభ్యున్నతికి బాటలు వేసేలా ఆయా కార్పొరేషన్‌లకు వెంటనే విధులు కేటాయించేలా చూడాలన్నారు. లేకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయలసీమ ఎస్సీ, ఎస్టీ హ్యూమన్‌రైట్స్ ఫోరం అధ్యక్షుడు రమణ, బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు పి.వి.రమణ, జనతాదళ్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఆర్‌హెచ్‌పీఎస్ అధికార ప్రతినిధి అమీన్‌పీర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న అవ్వారు మల్లికార్జున

దోమలు పెరగకుండా పారిశుధ్యం మెరుగుపరచాలి

ప్రొద్దుటూరు పారిశుధ్యంపై సమీక్షించిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు, జూలై 15 : వర్షాలు వస్తున్నాయి, నీళ్లు నిలబడి దోమలు పెరుగుతుంటాయి దీనికితోడు పారిశుధ్యం అధ్వానంగా వుంటే దోమలు వృద్ధి చెందుతాయని శానిటేషన్ అధికారులు, సిబ్బంది అప్రమత్తతతో పనిచేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు.సోమవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా వుండి శానిటేషన్ విధుల్లో లేకుండా కార్యాలయాల్లో పనిచేస్తుంటే వారందరినీ డివిజన్‌లకు పంపించాల్సిందేనని కమిషనర్ రఘునాదరెడ్డిని ఆదేశించారు మున్సిపాలిటీ పరిధిలో ఆవులు, కుక్కలను నియంత్రించే చర్యలు తీసుకోవాలన్నారు. .పట్టణంలో పారిశుధ్యం మెరుగు పరిచే చర్యల్లో భాగంగా ప్రతివీధికాలువల్లో దోమల నిర్మూల మందును పిచికారీ చేయాలన్నారు. ఫాగింగ్ తోపాటు ఆయిల్‌బాల్స్ కూడా మురికి కుంటలు, కాలువల్లో వేయాలన్నారు.ప్రధాన కాలువలతో పాటు వీధికాలువల్లో సకాలంలో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీల్లో 15 ఆటోలు మాత్రమే చెత్త సేకరణ చేస్తున్నాయి.తక్కిన ఆటోలు రన్నింగ్‌లో వచ్చేలా చర్యలుతీసుకోమని చెప్పాం. పారిశుధ్య కార్మికులకు ఇచ్చే యూనిఫాం, చెప్పులు, చీరలు, టవళ్ళు లాంటివి వారే నేరుగా కొనుగోలు చేసుకొని నాణ్యమైనవి అందించేలా చర్యలు తీసుకోమని ఆదేశించామన్నారు.వీధి లైట్ల కాంట్రాక్టు అయిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో లైట్లు వెలగటం లేదని వాటన్నింటిని మరమ్మతులు చేయించే తీసుకోమన్నారు.మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ చేపడతామన్నారు. అందుకోసం కలెక్టర్‌తో సమావేశమై ఆర్డీవో స్థాయి అధికారిని నియమించి ప్రొద్దుటూరులో రోడ్ల విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ ఛైర్మెన్లు వీఎస్ ముక్తియార్, వైఎస్ జబీవుల్లా మాజీ కౌన్సిలర్లు బాబయ్య, ఖలీల్ , శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాయుడు, నూర్ బాషా, గోవిందరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ప్రభావతి, సచివాలయశానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

దోమల నివారణ చర్యలు చేపట్టాలని వినతి

జమ్మలమడుగు, జూలై 15: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో దోమల నివారణ చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివ కుమార్ అన్నారు. సోమవారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనుకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా స్పందించి పట్టణంలో ఫాగింగ్ చేపట్టాలని వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు ఎల్లయ్య, నూరి, రమేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

నూనెపోసి గాయపరిచిన వెంకటసుబ్బారెడ్డిపై చర్యలు చేపట్టాలి

దళిత సంఘాల నాయకులు డిమాండ్

బద్వేలు, జూలై 15: అగ్రకుల దురహంకారంతో ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామంలో దళిత కులానికి చెందిన కదిరి ప్రభాకర్‌పై నూనెపోసి గాయపరిచిన అదే గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుడైన ప్రభాకర్ పక్క గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కళ్లుతిరిగి అక్కడ ఉన్న బండపైన సొమ్మసిల్లి పడిపోయాడు. ఆబండ అగ్రకులస్థులైనందున దళితుడు అయిన నువ్వు మా అరుగు మీదనే కూర్చుంటావా అని బూతులు తిడుతుండగా దీనిని ప్రశ్నించిన ప్రభాకర్‌పై వేడి నూనె పోసి గాయపరచడం సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించడం అగ్రకుల అహంకారానికి పరాకాష్ట అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన అతనిని వెంటనే అరెస్టు చేసి, ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, దళిత సంఘం సీనియర్ నాయకులు బి.కేశవయ్య, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కండువాకప్పి ఆహ్వానించిన సీఎం.సురేశ్‌నాయుడు

ఎర్రగుంట్ల, జూలై 15: పోట్లదుర్తిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీకి చెందిన కంచంరెడ్డి రామక్రిష్ణారెడ్డి (కిట్టయ్య) ఆధ్వర్యంలో సుమారు 41కుటుంబాలకు చెందిన వారు సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం.సురేశ్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, గంగిరెడ్డి సుబ్బిరెడ్డి, గంగిరెడ్డి పెద్దిరెడ్డి, గంగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి శేఖర్‌రెడ్డి, ఏరాసువెంకటరామిరెడ్డి, పెసల రామక్రిష్ణారెడ్డి, కంచంరెడ్డి రామిరెడ్డి, జంగాబాలిరెడ్డి, కంచంరెడ్డి శివరామిరెడ్డి, కంచంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కొత్తపల్లె సుబ్బారెడ్డి, గంగిరెడ్డి రామిరెడ్డి, చల్లా సుధాకర్‌రెడ్డి, పి.కే.శివారెడ్డి, మాలేపాటి జయరామిరెడ్డి, కే.జయరామిరెడ్డి, కంచంరెడ్డి అంకిరెడ్డి, వీరంరెడ్డి మల్లికార్జునరెడ్డి తదితరులతో కూడిన బృందం టీడీపీ తీర్థంపుచ్చుకుంది. ఈ కార్యక్రమంలో సీఎం.మునిస్వామినాయుడు, ఎంపీటీసీ పి.శివప్రతాప్‌రెడ్డి, తెలుగుయువత రాష్ట్ర నాయకులు జీవీ సారధినాయుడు, సీఎం.చరణ్, ఉపసర్పంచ్ రామునాయుడు, ఓబుళరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలోని టీడీపీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని దీన్ని చూసి అనేక వర్గాల వారు టీడీపీలో చేరుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం.సురేశ్‌నాయుడు పేర్కొన్నారు.



టీడీపీ కండువాలుకప్పుకుని పార్టీలో చేరిన నేతలు

'ఆర్‌అండ్‌బీలో ఇంటి దొంగలపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, జూలై 15: రోడ్లు, భవనాల శాఖలో ఇంటి దొంగలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ కార్యదర్శి సత్యనారాయణ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహ ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఉన్న 10 టన్నుల ఇనుమును రహస్యంగా ఎవరికీ తెలియకుండా బయటకు తరలించారని ఆ విషయం బయటకు పొక్కడంతో గుట్టుచప్పుడు కాకుండా వాహనం ద్వారా కార్యాలయానికి చేర్చారని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా ఏ వాహనంలో తరలించింది పరిశీలించి కేసు నమోదు చేయాలని కోరారు. ఇనుము తరలించిన విషయంపై విచారణ జరుపకుండా తొక్కిపెడుతున్నారని పేర్కొన్నారు. డీఈ అవినీతి భారీస్థాయిలో ఉందని రోడ్లపై గుంతలు పూడ్చే కాంట్రాక్టర్ల వద్ద కూడా మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆయన అవినీతిపై త్వరలో ఏసీబీకి లేఖ రాయనున్నట్లు తెలిపారు.

పద్మశాలీయులకు టీటీడీ పాలకమండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలి

కొండాపురం, జూలై 15: రాష్ట్రంలో 25 లక్షల జనాభా ఉన్న పద్మశాలీయులకు టీటీడీ పాలకమండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలని మండలంలోని పద్మశాలీయులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. పద్మావతి అమ్మవారి పుట్టినిల్లు అయిన తమ కులానికి టీటీడీ పాలకమండలిలో శాశ్వతసభ్యత్వం కల్పించేలా చర్యలు తీసుకోవాలని వినతపత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయుల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథరామయ్య, జిల్లా ప్రెసిడెంట్ రుద్రమహేశ్వరుడు,మండల ప్రెసిడెంట్ దామోదర,కొండయ్య, చంద్ర, తులసిరంగయ్య ,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రైతాంగాన్ని ఆదుకోవాలి

బద్వేలుటౌన్, జూలై 15 : బద్వేలు రైతాంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని, వాటిని పరిష్కరించి ఆదుకోవాలని నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనాయకుడు రితేష్‌కుమార్‌రెడ్డి వివరించారు. సోమశిలకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడును సోమవారం కలిసి బద్వేలు నియోజకవర్గంలో చాలా మంది రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారన్నారు. బ్రహ్మంసాగర్ ద్వారా బద్వేలు నియోజకవర్గంలోని 193 చెరువులకు కాలువలను అనుసంధానంచేసి ప్రతి చెరువుకు నీరు అందించి, ప్రతి ఎకరాను సాగులోకి తీసుకురావాలని ఆయనను కోరారు. ఆయనతోపాటు దేవదాయశాఖా మంత్రి ఆనంరామానాయుడును కలిశారు.



మంత్రి నిమ్మల రామానాయుడుతో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి

పాలిటెక్నిక్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనపరిచిన పాలిటెక్నిక్ విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 15: పాలిటెక్నిక్ పరీక్ష ఫలితాల్లో ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి తెలిపారు. ఈఈఈ విభాగంలో వెంకటమణికంఠ 83.30 శాతం, ప్రశాంత్‌కుమార్ 84.50 శాతం, మెహజాబీన్ 80.30 శాతం మార్కులు సాధించారు. మెకానికల్‌లో శివకుమార్ 81.20 శాతం, ఈసీఈ లో నందిని 87.09 శాతం, ఉమామహేశ్వర్ 84.64 శాతం, వెంకటరాముడు 83.82 శాతం మార్కులు సాధించారు. సీఎస్‌ఈలో మానస 84.80, మోహన్‌క్రిష్ణ 76.80, సుధాకర్ 74.30 శాతం మార్కులు సాధించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

కౌలు రైతులు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, జూలై 15: మండలంలో భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులకు కార్డులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని అర్హులైన వారు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు వెంకటరమణ సోమవారం తెలిపారు. కౌలు రైతులు పూర్తి వివరాల కోసం రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

కౌలు రైతు పత్రాలు పంపిణీ

ఖాజీపేట, జూలై 15: ప్రభుత్వం ఇచ్చే పథకాలు కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకటమహాలక్ష్మి అన్నారు. సోమవారం చెముళ్లపల్లె పంచాయతీ కౌలుకు చేసుకుంటున్న రైతులకు పంట సాగు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పత్రాలు పొందిన రైతులకు 11 నెలల కాలవ్యవధి ఉంటుందని, పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్, పంట మద్దతుధర, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు నేరుగా కౌలు రైతు లబ్ధిపొందవచ్చన్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగార్జున, మాజీ సర్పంచ్ వెంకరామిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



తప్పుడు వికలాంగుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ

బి.కోడూరు, జూలై 15 : తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పింఛను పొందుతున్న వారిపై ఈ నెల 25వతేదీ కడప రిమ్స్‌లో పునః పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. సదరం ధ్రువీకరణ పత్రం పొందిన వారందరికీ నోటీసులు పంపిస్తున్నామన్నారు. వారందరూ ఈ నెల 25న రిమ్స్‌లో తప్పక హాజరై వారి పత్రాలను పరిశీలించుకుని పింఛను తీసుకోవాలని వారు తెలిపారు. అలా వెళ్లని వారందరిపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ఖాజీపేట, జూలై 15: ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని పశువైద్య అధికారి బాబు రామచంద్ర అన్నారు. సోమవారం అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తపుల్లారు యానాది కాలనీ ప్రభుత్వ స్కూలులో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శివశంకర్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ ట్రస్టు కార్యదర్శి బాలకొండయ్య, ప్రధానోపాధ్యాయులు శివశంకర్‌బాబు, ప్రతాప్‌పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకంపై ఫిర్యాదు


ముద్దనూరు జూలై15: మండల పరిధి కోడిగాండ్లపల్లె సమీపంలో గ్రావెల్ తవ్వకం జరుపుతున్నారని సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో కోడిగాండ్లపల్లె చెందిన బీజేపీ నాయకులు తహసీల్దారు సువర్ణదేవికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామ సమీపంలోని సర్వే నెంబరు735లో దాదాపు 8 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు.నేషనల్ హైవే రోడ్డు ఏర్పాటుకు కాంట్రాక్టర్లు గ్రావెల్ తరలిస్తున్నారన్నారు.కనీసం మాగ్రామానికి రావాల్సిన సీనరేజ్ కూడా చెల్లించకుండా తవ్వకాలు జరుపుతున్నారని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు.ఈ కార్యక్రమంలో రంగనాయకులు, గంగాభవాణి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

మైదుకూరు రూరల్ జూలై 15 : మైదుకూరులోని 16వ వార్డులో తాగునీటి బోరు రెండు రోజులుగా పనిచేయలేదు. దీంతో టీడీపీ యువ నాయకుడు యాపరాల చిన్న ఇదే విషయంపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు.పుట్టా వెంటనే స్పందించి కమిషనర్ జబ్బార్‌మియాకు ఫోన్‌కు చేసి తాగునీటి బోరు రిపేరు చేయించాలని ఆదేశించారు.కమిషనర్ మున్సిపల్ సిబ్బంది చేత బోరును రిపేరు చేయించారు.

కండక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన ఆర్టీసీ జిల్లా అధికారులు

జమ్మలమడుగు, జూలై 15: జమ్మలమడుగు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు తిరుగు ప్రయాణంలో ఆదివారం నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కండక్టరు చౌడం జొల్లు తారకరామారావు (40) అనే వ్యక్తి ఘటనా స్థలంలో దుర్మరణం చెందారు.కాగా మృతదేహాన్ని ఆదివారం రాత్రి జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామానికి తరలించారు. దీంతో కడప ఆర్టీసీ అధికారులు కండక్టర్ తారకరాముడు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలియజేశారు. ప్రజారవాణా సంస్థ కడప జోనల్ కార్య నిర్వహణ అధికారి గిడుగు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్‌రెడ్డి, జమ్మలమడుగు డిపో మేనేజర్ ప్రవీణ్, డిపో సిబ్బంది మోరగుడి గ్రామంలోని మృతుడి స్వగృహం నందు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆర్టీసీ సంస్థ తరుపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.



మృతుని ఇంటి వద్ద మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

జమ్మలమడుగు, జూలై 15: జమ్మలమడుగులో మొహర్రం పండుగను కులమతాలకు అతీతంగా భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఎనిమిది రోజుల నుంచి జమ్మలమడుగు పట్టణంలోని గూడుమస్తాన్ వలి దర్గా సమీపాన, మెయిన్ పోస్టాఫీసు సమీపాన తదితర గ్రామాల్లో భక్తులు పీర్లను కొలువుదీర్చారు. ప్రతిరోజు ఉదయం, రాత్రి భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కుకుంటున్నారు. అందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం మొహర్రం పండుగలో 8వ రోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పట్టణంలో ఊరేగింపు చేశారు.



మసీదు కమిటీకి రూ.50 వేలు వితరణ

జమ్మలమడుగు, జూలై 15: జమ్మలమడుగు పట్టణంలో సోమవారం అన్వారే ముస్తఫా మసీదు కమిటీ సభ్యులకు హైకోర్టు న్యాయవాది (హైదరాబాదు) భైరెడ్డి లక్ష్మీరెడ్డి కమిటీవారికి రూ.50 వేలు వితరణ చేశారు. మసీదు గుమ్మజ్ మీనార్లను నిర్మించడానికి పెద్దముడియం మండలం వాసిగా ఆయన స్పందించి సుశీలమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో వితరణ చేశారు.

పైసలిస్తేనే.. లోన్లకు అప్లైచేస్తాం

- డ్వాక్రా సంఘాలకు ఆర్పీల డిమాండ్
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బీజేపీ, టీడీపీ నాయకులు

ఎర్రగుంట్ల, జూలై 15: డ్వాక్రా మహిళల లోన్‌కు దరఖాస్తు చేయాలంటే ఆర్పీ (రీసోర్స్ పర్సన్)లకు రూ.500 ఇస్తేనే చేస్తామంటున్నారని లేదంటే చేయమని బెదిరిస్తున్నారని బీజేపీ టౌన్ అధ్యక్షుడు కట్టుబడి ప్రకాశం, జిల్లా కన్వీనర్ సత్యంసామి, రాజశేఖర్, కే.జయప్రకాశ్ సోమవారం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎర్రగుంట్ల నగరపంచాయతీలో ఆర్పీల దందా రోజురోజుకు అధికమౌతోందని వారు పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలు లోన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే ఒక్కొక్క సభ్యురాలు రూ.500 ఇవ్వాల్సిందేనని, లేదంటే లోన్ అప్లై చేయమని, ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరిస్తున్నారని తెలిపారు. అలాగే ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ డబ్బులు 10మంది సభ్యులకు తెలియకుండా డ్రా చేసుకుని మీటింగులకు, డిన్నర్లకు ఖర్చుచేస్తున్నారని ఆరోపించారు. వెంటనే విచారించి వారిపై చర్యలు తీసుకోవాలని వారు కమిషనర్‌ను కోరారు.

వైసీపీ నేత పొలం ఆక్రమించారు...

- న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

జమ్మలమడుగు, జూలై 15: జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలం చిన్నపసుపుల గ్రామంలో వైసీపీ నేత తమ పొలాన్ని ఆక్రమించాడని అధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించినట్లు బాధితులు నాగసుంకేశ్వరి, ఆమె భర్త రాజు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం వారు మాట్లాడుతూ పెద్దముడియం మండలం చిన్నపసుపుల గ్రామంలో సర్వే నంబరు 320/1లో 1.94 ఎకరాల భూమిని మా అబ్బ తండ్రికి తండ్రి అయిన ఎరుకల నాగన్నకు ప్రభుత్వం డీకేటీ పట్టా మంజూరు చేసిందన్నారు. తర్వాత ఆయన మరణించిన తర్వాత మా తండ్రి ఎరుకల సంజీవరాయుడు, తండ్రి నాగన్నకు 1998 సంవత్సరంలో పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేశారన్నారు. ఆ పొలంలో పంట సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. వైసీపీ నాయకుడు గ్రామంలో అధికారులను అడ్డం పెట్టుకుని పొలాన్ని ఆక్రమించి తమకు రానివ్వకుండా ఇబ్బంది కలిగిస్తున్నాడన్నారు. వెంటనే అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాధితులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.

